క్లుప్తంగా

నేడు మోటుమాలలో సంతకాల సేకరణ

కొత్తపట్నం: మెడికల్ కళాశాలలు పీపీపీ విధానంలో నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు గురువారం ఉదయం 11 గంటలకు మండలంలో ఈశన్య గ్రామ పంచాయతీ మోటుమాలలో ఆ పార్టీ నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ అంకపోతు అంజిరెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి ఒంగోలు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త చుండూరి రవిబాబు ముఖ్య అతిథిగా హాజరతారని పేర్కొన్నారు. మండలంలో ఉన్న కార్యకర్తలు, అభిమానులు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, బూత్ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు హాజరు కావాలని అంజిరెడ్డి కోరారు.

చేతుల పరిశుభ్రత పాటించడం ముఖ్యం

సంతనూతలపాడు: సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక, ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో హ్యాండ్ వాష్ డే దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం ద్వారా జలుబు, జ్వరం, డయేరియా వంటి వ్యాధులను నివారించవచ్చని ముఖ్య అతిథులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వర్ణలత, అరుణ కుమారి, ముంతాజ్ బేగం, ఏ. శ్రీనివాసరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంవీఎస్ శాస్త్రికి సన్మానం



ఎంవీఎస్ శాస్త్రిని సన్మానిస్తున్న అర్చకులు, భక్తులు

ఒంగోలు మెట్రో: మోక్ష సామ్రాజ్యాన్ని కైవసం చేసుకున్న మహా భక్తాగ్రేసరుల్లో పోతనది అగ్రస్థానమని, పోతన భాగవత పద్యాలు మకరంద సదృశాలని ఆధ్యాత్మిక ఉపన్యాసకులు, భాగవత ప్రచార సేవా సమితి అధ్యక్షుడు ఎంవీఎస్ శాస్త్రి పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు దక్షిణం బజారులోని వేణు గోపాలస్వామి ఆలయంలో భాగవత కథా సుధా లహరి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వెయ్యేళ్ల తెలుగు సాహిత్య చరిత్రలో కవిత్రయంగా పేరొందిన నన్నయ, తిక్కన, ఎర్రన్నల తర్వాత వినిపించే పేరు పోతనదేనని తెలిపారు. పోతన మహాకవి రచించిన భాగవత కావ్యంలోని కథలను సరళ సుందరంగా తెలియజేసిన ఎంవీఎస్ శాస్త్రిని వేణుగోపాల స్వామి దేవస్థానం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

దేవాలయాల ప్రాశస్త్యాన్ని తెలియజేయాలి

- దేవాలయాల అభివృద్ధిపై సమగ్ర ప్రణాళిక రూపొందించండి
- దేవదాయ, ధర్మాదాయ శాఖపై సమీక్షలో కలెక్టర్ రాజాబాబు



దేవదాయ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని దేవాలయాల ప్రాశస్త్యం గురించి ప్రజలకు తెలిసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పీ.రాజాబాబు దేవదాయ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ రాజాబాబు దేవదాయ, ధర్మాదాయ శాఖల అధికారులతో సమావేశమై ఆ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై అసిస్టెంట్ కమిషనర్ కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో దేవదాయ శాఖ పరిధిలో మొత్తం 1,001 దేవాలయాలు, సత్రాలు ఉన్నాయని, అందులో 12 పురాతన, చారిత్రక దేవాలయాలు ఉన్నాయన్నారు. 38,866.95 ఎకరాల భూమి దేవదాయ శాఖ పరిధిలో ఉందని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధితో పాటు వాటి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జాతర్లు, ఉత్సవాలు ప్రజలకు తెలిసేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలోని దేవాలయాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. తొలివిడత జిల్లాలో సుమారు 20 పురాతన, చారిత్రక దేవాలయాలను గుర్తించి ఆ ఉత్సవాలు, జాతరలు పెద్ద ఎత్తున నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. జిల్లాలో దేవదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, సూపరింటెండెంట్ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోజూ రిజిస్ట్రేషన్ వివరాలు పంపాలి

- కలెక్టర్ రాజాబాబు



కలెక్టర్‌కు వివరాలు చెబుతున్న జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు

ఒంగోలు సబర్బన్: రోజూ జరిగే రిజిస్ట్రేషన్ల వివరాలు ఎప్పటికప్పుడు కలెక్టరేటుకు పంపించాలని జిల్లా రిజిస్ట్రార్‌ను కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో బుధవారం ప్రకాశం భవనంలోని తన చాంబర్లో ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. వ్యవసాయ భూముల విషయంలో ఆటో మ్యూటేషన్, నిషేధిత భూముల వివరాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు చేరుతున్న తీరు, తదితర అంశాలను జిల్లా రిజిస్ట్రార్ ఆళ్ల బాలాంజనేయులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాల వారీగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం, మన జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా వచ్చిన ఆదాయం, రిజిస్ట్రేషన్ అనంతరం రైతులకు ఇబ్బందులు రాకండా చూసుకోవాలన్నదే ప్రధాన ఉద్దేశంగా సమీక్షలో చర్చించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ గతంలో జిల్లాలో ఫోర్జరీ సంతకాలు, నకిలీ స్టాంపులతో జరిగిన భూ కుంభకోణంపై ఆరాదీశారు. తమ భూమి తమ ఆధీనంలోనే ఉన్నా వెబ్ ల్యాండులో ఇతరుల పేరు ఉన్నట్లు మీకోసంలో ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ చెప్పారు. తప్పుడు రిజిస్ట్రేషన్‌లపై సరైన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినందున రోజువారీగా భూముల రిజిస్ట్రేషన్ల వివరాలను కలెక్టరేటుకు పంపించాలని ఆదేశించారు. భూ ఆక్రమణలకు, అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేసేలా ఈ వివరాలను పరిశీలించేందుకు కలెక్టరేట్లో ప్రత్యేక సిబ్బందిని కేటాయిస్తానని ఆయన తెలిపారు. సమావేశంలో ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ సీహెచ్ఎన్ వరప్రసాదరావు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జయంతిని విస్మరించిన అధికారులు



కలాంకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



నివాళులర్పిస్తున్న జేఏసీ నాయకులు

ఒంగోలు టౌన్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని జిల్లా యంత్రాంగం పూర్తిగా విస్మరించిందని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షేక్ సత్తార్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని బిలాల్ నగర్ కూడలి, కొండమిట్ట వద్ద ఉన్న అబ్దుల్ కలాం విగ్రహాల వద్ద ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్తార్ మాట్లాడుతూ గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కొండమిట్ట వద్ద అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, నాడు కలాం జయంతి, వర్ధంతిలను క్రమం తప్పకుండా నిర్వహించారని గుర్తు చేశారు. ఇప్పుడు జిల్లా యంత్రాంగం పూర్తిగా కలాంను మరిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం విగ్రహం వద్ద గౌరవ సూచకంగానైనా బ్లీచింగ్ చల్లి శుభ్రం చేయకపోవడం విచారకరమన్నారు. చివరికి మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులకు కూడా కలాం గుర్తుకురాలేదని, ఇక మిగిలిన వారి గురించి ప్రస్తావించడం కూడా అనవసరమేనన్నారు. ప్రజాప్రతినిధుల పుట్టిన రోజులకు పోటీలు పడి బొకేలతో ప్రత్యక్షమతున్న అధికారులు, నాయకులకు కలాం వంటి భారతరత్న గుర్తుకు రాకపోవడం సిగ్గుచేటన్నారు. రాజకీయాలు మరిచి కలాం వంటి మహానేతలను ఒకసారైనా తలచుకుంటే నేటి తరం నాయకులు, ప్రజాప్రతినిధులు ఆత్మశుద్ధి చేసుకున్నట్లుందని చెప్పారు. ఎస్డీపీఐ నాయకులు పఠాన్ ఖాజావలి, బాజీ, మున్నా, జుబేర్, ఖాశీంవలి పాల్గొన్నారు.



కలాంకు నివాళులర్పిస్తున్న ఎస్డీపీఐ నాయకులు

ఒంగోలు సిటీ: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని స్థానిక శ్రీహర్షిని డిగ్రీ కళాశాలలో వరల్డ్ విద్యార్థుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల డీన్ దాడి ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అబ్దుల్ కలాం దేశానికి రాష్ట్రపతిగా, సైంటిస్టుగా విశేష సేవలు అందించారని కొనియాడారు. కలాంను మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలుస్తారని తెలిపారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, డిగ్రీ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళులు

చీమకుర్తి: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా అణగారిన కులాల ఐక్యవేదిక జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం చీమకుర్తిలో ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు బండ్ల కొండలరావు, షేక్ ఖాదర్‌బాషా, పేరం శ్రీనివాసరావు, పిన్నిక శ్రీనివాసరావు, వేమా బాలకోటేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: ఫెన్సింగ్ అండర్–14 సబ్ జూనియర్ బాలబాలికల ఎంపిక ఈ నెల 16న స్థానిక మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఫెన్సింగ్ ప్రకాశం జిల్లా అసోసియేషన్ కార్యదర్శి జి.నవీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభం అవుతుంది. ఆసక్తి ఉన్న వారు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ధ్రువీకరణ పత్రం, వ్యక్తిగత ఫెన్సింగ్ క్రీడా పరికరాలతో హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు జి.నవీన్ 89789 05694 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 18న కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరుపున పాల్గొనాల్సి ఉంటుందని జిల్లా కార్యదర్శి జి.నవీన్ తెలిపారు.

19న బాస్కెట్‌బాల్ క్రీడా జట్ల ఎంపిక

ఒంగోలు: ప్రకాశం జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ క్రీడా జట్ల ఎంపిక ఈ నెల 19న కందుకూరులోని టీఆర్ఆర్ డిగ్రీ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు బాస్కెట్ బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వలేటి రవీంద్ర, తొట్టెంపూడి సుబ్బారావులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఎంపికకు వయసుతో సంబంధం లేదు. ఎంపికైన క్రీడాకారులు నవంబరు 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు 98661 26955 లేదా 98494 29839 నంబర్లను సంప్రదించాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు.

రేపు ఎస్‌జీఎఫ్ క్రీడా జట్ల ఎంపిక

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి చక్కా వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాకీ, అద్దంకి కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. అండర్–14, అండర్–17 బాలబాలికలు పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

బిల్లులు సకాలంలో విడుదల చేయాలి



కలెక్టర్‌కు వివరాలు అందిస్తున్న జగన్నాథరావు

- ఖజానా, అగ్నిమాపక, జౌళి, క్రీడా విభాగాల సమీక్షలో కలెక్టర్

ఒంగోలు సబర్బన్: జిల్లా ఖజానా శాఖ అధికారులు సకాలంలో బిల్లులు చెల్లించాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో ఖజానా శాఖతో పాటు అగ్నిమాపక, జౌళి, జిల్లా క్రీడా విభాగాల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రత్యేకంగా ఖజానా శాఖపై లోతుగా సమీక్షించిన కలెక్టర్ కొందరి అధికారుల తీరును నిలదీశారు. ప్రభుత్వ అధికారులు, ఇతర బిల్లుల విషయంలో అలసత్వం వద్దన్నారు. అనంతరం విపత్తుల నిర్వహణ–అగ్నిమాపక శాఖపై కూడా లోతుగా సమీక్షించారు. మెరుగైన సేవలపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. చేనేత–జౌళి శాఖ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులతోనూ కలెక్టర్ సమీక్షించారు. మెరుగైన సేవలు అందించడంపై దృష్టి సారించాలని సూచించారు. ఇందుకోసం ఆయా శాఖల అవసరాలు, నిధుల లభ్యతపై ఆరా తీశారు. డీఎంఎఫ్ నిధుల నుంచి ఆర్థిక వనరులు సమకూరుస్తామని చెప్పారు. జిల్లా విపత్తుల నిర్వహణ–అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు రఘునంద, జిల్లా ఖజానా అధికారి జగన్నాథరావు, జిల్లా క్రీడా అధికారి రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి రాజ్యాంగంపై దాడే



నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

చీమకుర్తి: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై మనువాదులు చేసిన దాడి రాజ్యాంగంపై దాడిగానే పరిగణిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం చీమకుర్తిలోని పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తూ చీఫ్ జస్టిస్‌పై చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు, సుజాత, తొట్టెంపూడి రామారావు, స్థానికులు పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్

- నలుగురు విద్యార్థులు డీబార్

ఒంగోలు సిటీ: బీఈడీ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన నలుగురు విద్యార్థులను స్క్వాడ్ డీబార్ చేసినట్లు ఏకేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సోమశేఖర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొదిలి పరిధిలోని కేంద్రాలను తనిఖీ చేస్తున్న సందర్భంలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన వారిని స్క్వాడ్ బృందం గుర్తించిందని పేర్కొన్నారు. బీఈడీ ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్ పరీక్షలు జిల్లాలోని 42 కేంద్రాల్లో నిర్వహిస్తుండగా 3 స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏకేయూలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో, యూనివర్సిటీ కాలేజీలో పీజీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ జి.సోమశేఖర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సోమశేఖర మాట్లాడుతూ ఒరిజినల్ సర్టిఫికెట్లతో డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయం వద్దకు హాజరుకావాలని సూచించారు. అడ్మిషన్ పొందే విద్యార్థులు అదే రోజు అప్లికేషన్, రిజిస్ట్రేషన్ ఫీజు, కోర్సు ఫీజు మొత్తం చెల్లించాల్సి ఉంటుందన్నారు. స్పాట్ ద్వారా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని స్పష్టం చేశారు. కోర్సుల వివరాలు వరుసగా ఎంఏ హిస్టరీ, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ సోషల్ వర్క్, ఎం.కామ్, ఎంపీఎడ్, ఎంఎడ్, బీపీఎడ్, ఎమ్మెస్సీ మేథమేటిక్స్, ఎమ్మెస్సీ ఆక్వా కల్చర్, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 89784 96178, 63043 43448 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చేతుల శుభ్రత ఆరోగ్యానికి భద్రత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

నాగులుప్పలపాడు: చేతుల శుభ్రత ఆరోగ్యానికి భద్రత అని నాగులుప్పలపాడు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి ఒనారియల్, ఎంపీడీఓ తేళ్ళ రవికుమార్ అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా పరిషత్ హైస్కూల్, అంబేడ్కర్ నగర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బడుగు శౌరి, పంచాయతీ కార్యదర్శులు అట్లూరి శరత్ బాబు, సౌజన్య, ఏపీవో డీ రవిబాబు ఎంఆర్సీ అంజయ్య, టెక్నికల్ అసిస్టెంట్ జయ శ్రీ, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్ కుమార్, మెడికల్ అండ్ హెల్త్ సిబ్బంది సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఉపాధి కూలీలకు నిర్వహిస్తున్న ఈ కేవైసీ విధానాన్ని ఎంపీడీఓ పరిశీలించారు.

విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోవాలి

ఒంగోలు సిటీ: విద్యార్థులు రోజూ తినేందుకు ముందు, బాత్రూమ్‌కు వెళ్లి వచ్చిన తర్వాత చేతులు శుభ్రం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు జేసీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జన విజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఒంగోలు మండల పరిధిలోని కరవది శ్రీవాణి విద్యా నికేతన్ పాఠశాలలో వరల్డ్ హ్యాండ్ వాష్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చేతులు కడుక్కోకుండా తింటే డయారియా, విరోచనాలు ఇతర అంటువ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని తెలిపారు. ఉపాధ్యాయులు బి.సతీష్‌కుమార్, అనీల్, సునీత, అనుషా, కె.శిరీషా, కె.రత్నవాణి, స్వాతి, షీనా పాల్గొన్నారు.

ట్రంప్ విధానాలు దేశానికి ప్రమాదకరం


నాగులుప్పలపాడు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించే సుంకాలు మన దేశానికి ప్రమాదకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు, జిల్లా నాయకులు జే జయంతిబాబు పేర్కొన్నారు. మండలంలోని ఉప్పుగుండూరు బస్టాండ్ సెంటరలో అమెరికా ఆధిపత్యాన్ని, ట్రంప్ సుంకాలను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల కార్యదర్శి టీ శ్రీకాంత్ అధ్యక్షతన బుధవారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 60 శాతం సుంకాలతో ఆక్వా రైతులను నష్టాల్లోకి నెట్టివేస్తోందన్నారు. దేశానికి హాని కలిగించే ట్రంప్ విదానాలకు, అమెరికా సామ్రాజ్యవాదానికి మోదీ ప్రభుత్వం మోకరిల్లకుండా అందరు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు జీ బసవపున్నయ్య, ఎస్ రామారావు, యు.వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లోక కళ్యాణార్థం శాంతి హోమం

ఒంగోలు మెట్రో: నగరంలోని నెహ్రూ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఎదుట లోక కళ్యాణార్థం బుధవారం ఉదయం శాంతి హోమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దేవస్థానం ఆవరణలో చూడచక్కని హోమ గుండాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వేద పండితులు గుండం వద్ద ఆశీనులై మొదటగా నవగ్రహ హోమం, శ్రీలక్ష్మీ గణపతి హోమం, సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం మహా శాంతి హోమాన్ని వేద మంత్రోచ్ఛరణల నడుమ పూర్తి చేశారు. దేవస్థానం పాలక మండలి సభ్యులు, నగర ప్రముఖులు, భక్తులు పాల్గొని యజ్ఞ ఫలాన్ని స్వీకరించారు.



హోమ క్రతువులో పండితులు



హోమాన్ని తిలకిస్తున్న భక్తులు